# ఉపనిషత్ ఉద్యానవనం (సంపుటి - 3)

## - శ్రీ యేలేశ్వరపు హనుమ రామకృష్ణ

## వేద వాఙ్మయము - భారతీయ లలిత కళలు

స్వయం బ్రహ్మానంద స్వరూపులారా! పాఠక మహాశయులారా! నమో నమః

'భారతీయులు' అనగా 'జ్ఞానము'నందు రమించువారు - అని శబ్దార్థము. (భ = వెలుగు). తెలిసినా, తెలియకపోయినా కూడా, **ఈ భూమిపై గల జీవులందరు భా-రతీయులే!**

**తత్త్వ శాస్త్రము = నీవు అట్టి తత్-ఆత్మ (పరాత్మ / పరమాత్మ) స్వరూపుడవే** - అని సశాస్త్రీయంగా నిరూపిస్తూ చెప్పునదే **తత్త్వశాస్త్రము.** తత్త్వశాస్త్రములో పాఠ్యపుస్తకములవంటివే - **ఉపనిషత్తులు, యోగవాసిష్ఠాది గ్రంథములు, భగవద్గీత, ఉద్ధవగీత, అష్టావక్రగీత, అష్టాదశ పురాణములు** మొదలైనవి. కొంచెము ముక్కుకు సూటిగా చెప్పేవి ఉపనిషత్తులు. శ్రీ శంకర, రామానుజ, మధ్వాచార్యులు, బుద్ధుడు, శ్రీరమణ మహర్షి, శ్రీ రామకృష్ణ పరమహంస, మొదలైన మహనీయులంతా వేద ప్రవచనమగు "తత్ త్వమ్"నే యుక్తి యుక్తంగా చెప్పుకొస్తున్నారు. ఇంకెందరో, ఎందరెందరో ఈ **'జీవ బ్రహ్మైక్య గానామృతము'**ను వినిపిస్తూనే ఉన్నారు.

అంతే కాకుండా భారతీయ కళావిన్యాసములైనట్టి శాస్త్రీయ సంగీతములో, జానపద సంగీతములో, భరతనాట్యము - కథకళీ - కథక్ -కూచిపూడి నృత్యము మొదలైన కళలలో కూడా **తత్త్వశాస్త్ర పరమార్థములు, తత్త్వచింతన** మారు మ్రోగుచూనే ఉన్నాయి. తెలుగువారికే ప్రత్యేకమై కనిపించే హరికథలలో కూడా పూజార్హులగు మన హరిదాసులచే తాత్త్విక విశేషాలు గానం చేయబడుచూనే ఉన్నాయి.

ఎటొచ్చీ శ్రద్ధగా విని, శ్రవణానందముగా ఆస్వాదించి, తత్త్వశాస్త్రార్థముకు హృదయస్తము చేసుకొని, దృష్టిని పవిత్రము చేసుకోవలసినది మనమే। **అంతా సిద్ధమే. మనమే సిద్ధము కావాలి.**

భారతీయ కళలలో అనేక రూపములుగా తత్త్వశాస్త్రము విస్తరించి ఉన్నది. (కూచిపూడి గ్రామ నివాసిని అవటంచేత) కూచిపూడి నృత్య వాఙ్మయములో ఏవిధంగా తత్త్వ శాస్త్ర శబ్దములు వెలుగొందుచున్నాయో - కొన్ని విశేషాలు ఇక్కడ చెప్పుకొంటున్నాము.

## కూచిపూడి నృత్య జతులు - తత్త్వ శాస్త్ర శబ్దజాలము

| | |
|---|---|
| **తాంతత్తై**<br>**(తాం తత్ తై)** | ❖ ఈ జీవుని సహజ రూపము 'తత్' స్వరూపమగు పరమాత్మయే.<br>❖ ఈ బ్రహ్మాండమంతా పరమాత్మకు నృత్య మందిరము. |
| **తై హిత తాం తై హి**<br>**(తై హి తత్ తాం తై హి)** | ❖ ఆ 'తత్' శబ్దార్థమగు 'పరమాత్మ'యే ఇక్కడ 'జీవుడు'గా ప్రదర్శనమగుచున్నాడు. (జీవో బ్రహ్మేతి నా పరః)<br>❖ ఈ జీవాత్మల విన్యాసమంతా పరమాత్మయొక్క నృత్య భంగిమలే. |
| **ఈదా తాంతత్తై**<br>**(ఈదా తాం తత్ తై)** | ❖ జీవాత్మ స్థితిని దాటి పరమాత్మత్వము సిద్ధించుకొనెదము గాక। |
| **తత్గ ధీంత**<br>**(తత్ గత ధీం త)** | ❖ ఆ 'పరమాత్మ' యొక్క 'గతి' (పోకడ, చలనము, నడక, సంగతి)నకు సంబంధించిన ధీశక్తి (బుద్ధి)ని పొందెదము గాక। |
| **తాహత ధీనుత**<br>**తా(ని) హత ధీనుత** | ❖ పరమాత్మయొక్క **"తాహతు - స్థానము"**ను బుద్ధితో తెలుసుకొని భావన కలిగియుండెదము గాక।<br>❖ 'తాను' అనే అహమును హతము(నాశనము) చేయు బుద్ధి లభించును గాక। |
| **తత్ ధీనుత** | ❖ మా బుద్ధి తత్ పరమాత్మ / బ్రహ్మమునందు - **వికాసము** పొందును గాక। |
| **తాను ఝునాంతరి** | ❖ మా బుద్ధి గంగా ప్రవాహమువలె విశ్వాత్మత్వము వైపుగా ప్రవహించును గాక। |
| **తఝుంతరిత (తత్ ఝుంతరిత)**<br>**తఝుం ఝుంతరిత** | ❖ తత్ (పరమాత్మ) గురించిన భావములు సముద్ర తరంగములవలె, గంగా ప్రవాహము వలె మరల మరల మా బుద్ధియందు పరిఢవిల్లును గాక। |
| **ఝుంతకరేకిణ**<br>**('ఝుం' తత్ కర ఈకిణి)** | ❖ 'తత్'ని సిద్ధింపజేయు కర్మలు మాచే ఆశ్రయించబడు గాక! అగ్ని కణములవలె ఆత్మానుభవము బయల్వెడలును గాక। |
| **తకిట ధికిట** | ❖ 'తత్' అర్థము వీణానాదమువలె బుద్ధియొక్క ధ్వనిగా - ధ్వనిరూపము దిద్దుకొనును గాక। |
| **తక్కిణనగ (తత్ కిణనగ)** | ❖ 'తత్' కింకిణీ శబ్దము వెల్లివిరియును గాక। |
| **తకుందరి కిటతక**<br>**(తత్ కుందరి కిటతక)** | ❖ కిట (దేహ భావము) అధిగమించబడి 'తత్' అను భావన స్థంబము వలె నిశ్చలమగును గాక! |

ఈవిధంగా కూచిపూడి నాట్య కళలో అనేక జతి - తాళ - లయ శబ్దములు వేద శబ్దములతో కూడిన తత్త్వ శాస్త్రము నుండియే బయల్వెడలాయి. ఇట్లాగే 'భరత నాట్యములోని, 'కథకళీ' లోని 'కథక్'లోని జతిరూప శబ్దార్థములు కూడా. భారతీయ భాషలన్నిటిలో తాత్త్విక శబ్దార్థములు అలంకరించబడినవై ఉన్నాయి. దైనందికమైన సంభాషణలలో కూడా తత్త్వశాస్త్రార్థాలే చొచ్చుకొని ఉన్నాయి.

**కూచిపూడి నాట్యశాస్త్రములోని 'హంస' ముద్ర, సోఽహమ్ :** బొటనవ్రేలు **'తత్'**ను, చూపుడు వ్రేలు **'త్వమ్'**ను, మిగిలిన '3' వ్రేళ్లు - **త్రిగుణాత్మక జగత్తును** సూచిస్తూ చెప్పబడుచున్నాయి.

ఇక ఈ.వర్తమాన - 'ఉపనిషత్ ఉద్యానవనము - 3వ సంపుటిలోని విశేషాలకు వద్దాము.